

# పూజారి వ్యాపారం

సి. నాగిరెడ్డి

కొందరి జీవితం వడ్డించిన విస్తరి. మరి కొందరి జీవితం మల్లన్న జీవితంలాగ వడ్డించని విస్తరి. తిండి మొదలు విస్తరాకు వరకు అన్నీ తమే చూసుకోవాలి.

మల్లన్న ఫ్యాక్టరీలో వర్కరు. వాడు నివసించేది ఒక పూరిగుడిసెలో. మునిసిపాలిటీవారి ధర్మమా అంటూ పారిపోని చెత్తా చెదారం, డ్రైనేజి కంపు. నీళ్ళు వాడి గుడిసెచుట్టూ కాపురం చేస్తుంటాయి ధనవంతుడి పాపం లాగ. అప్పుడప్పుడు బయటి ఎంగిలి విస్తరాకులు గాలికెగరటానికి గుడిసెలోనికి దారితీసి మల్లన్న ఆకలిని గుర్తు చేస్తుంటాయి.

ఏవేవో ఆలోచనలతో సతమతమవుతున్న మల్లన్న రంగి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు.

"నాయన. బువ్వ తిందు రా" అంది రంగి.

రంగి మల్లన్న ఏకైకపుత్రిక. తల్లిలేని అనాథ. అందరి బీదల పిల్లలవలె రంగి కూడా చిన్నప్పుడే పనులు చేయటం నేర్చుకున్నది. తండ్రికి ప్రొద్దున్నే రొట్టెలు చేసి సద్దికట్టి పనికి పంపేది. తను మిగిలిన రొట్టెముక్కలు తినేది. తండ్రి తిరిగి వచ్చే వరకు గుడిసె చుట్టూ వున్న మురికిపిళ్ళలో తన స్నేహితులతో కలసి ఆడుకునేది. మనిషికి పశువుకు తేడా తెలియని ఆనందం వారిది.

ఎవరో దేశనాయకుడు చనిపోయినందున ఆ రోజు మల్లన్నకి సెలవు దొరికింది. ఇంటి దగ్గరనే వున్నాడు. వాడికి దేవుడంటే భక్తి మెండు. తన భార్య బ్రతికున్న రోజులలో అప్పుడప్పుడు గుడికెళ్ళేవారు. ఆమె పోయిన తరువాత ఆలయానికి పోయే అలవాటు తప్పింది తీరిక లేక. ఆ రోజు సెలవుగనుక గుడికి పోవాలనుకున్నాడు కూడా రంగితో. స్నానముచేసి తనకున్న శుభ్రమైన చింపిరి గుడ్డలను వేసుకున్నాడు.

"రంగీ! గుడికి పోయి వస్తాం రా" అంటూ రంగిని తీసుకుని బయలుదేరాడు గుడికి.

తండ్రి వెంబడి తిన్నగా రోడ్డుప్రక్కన నడుస్తూ గుడిని చేరుకున్నారు. గుడిని చూడగానే రంగికి దేవుడు ధనవంతుడని నమ్మకం కుదిరింది. ఎందుకంటే దేవుడిగుడి రాతితో అందంగా కట్టబడింది. తమదేమో పూరిగుడిసె. తమ గుడిసెలో వర్షాకాలం పొటుకు పడుతుంది. చలికాలం చలిపెడుతుంది. దేవాలయంలోని గంటలు వినబడుతున్నాయి. రంగి మనసు తెలియని ఆనందంతో నిండిపోయింది. దేవుడిని చూసే అదృష్టం తనకు యీనాడు కలిగింది.

ఆ గుడిలో ఒకచోట ప్రార్థనలు. మరొకచోట భజనలు జరుగుతున్నవి. గంటల గణగణలు గుడినంతా ఆక్రమించుకున్నాయి. భక్తులు రెండు చేతులూ జోడించి కళ్ళుమూసుకుని దేవుడిని సేవిస్తున్నారు. వారినందరినీ ఆశ్చర్యంతో చూస్తూ రంగి తండ్రితో.

"నాయన! వాళ్ళెందుకు అట్లా చేస్తున్నారు." అంది.

"దేవుడిని మొక్కుతున్నారమ్మా" జవాబిచ్చాడు మల్లన్న.

"దేవుడిని అట్లెందుకు మొక్కాల" అర్థంకాక

అడిగింది.

జవాబు చెప్పకుండానే అల్లరి చేయవద్దని రంగిని చేత పట్టుకుని దేవుడి ముందుకు పోయాడు.

దేవుడి విగ్రహాన్ని ఇనుప ఊచల వెనక బంధించారు. పాపాలను చేసే మనుషులను బంధించే బదులు దేవుడిని బంధించడమే మంచిదనుకున్నారేమో!

ఇనుప ఊచల ముందు ఒక పెద్ద హుండీ డబ్బా వుంది. ఊచల వెనుక దేవుడి ముందు పూజారి వున్నాడు. పూజారి కన్ను ఎప్పుడు హుండీ మీద వుంటుంది. దేవుడి ప్రసాదానికి హుండీ చప్పుడికి దగ్గర సంబంధం వుందని మల్లన్నకేం తెలుసు పాపం. మల్లన్న అందులో ఏమి వేయలేదు, తన దగ్గర ఏమీ లేదు. ఇక దేవుడికేమి యిస్తాడు. తన దగ్గర వున్నది భక్తి మాత్రమే.

దేవుడికి నమస్కరించి మల్లన్న, రంగీ చేయి చాపాడు ప్రసాదానికి. పూజారి కన్నెర్ర చేశాడు.

"ప్రసాదం లేదు గిసాదం లేదు ఫో ఫో-అడ్డమైన గాడిదకి దేవుడి ప్రసాదం కావాలి. దేవుడు మాత్రం ఊరకే ప్రసాదం యిస్తాడా" అంటూ పూజారి మల్లన్నను కుక్కను కసురుకున్నట్టు కసురుకున్నాడు.

తన బంపరాతి హృదయం మీద మరో సమ్మెట పోటు వేసినట్టయింది మల్లన్నకు.

"నాకు లేకపోతేమానె. ఈ అమ్మాయికైన ప్రసాదం పెట్టండి స్వామి" అంటూ రంగి చేయి ముందుకు చాపాడు మల్లన్న దీనాభావంతో.

చేయి విదిలించేశాడు పూజారి. ఇంకా ఏదో వారికి దీవెనలిచ్చు బోయేంతలో బయట కారు ఆగిన చప్పుడయింది.

కారులోనుండి మునిసిపల్ ఛైర్మన్ వారి సతీమణీ దిగారు. పూజారి ఎదురేగి ముకుళితహస్తాలతో వారికి లోనికి రమ్మనమని స్వాగతం పలికాడు. ఇనుప ఊచల వాకిలి తెరిచి దేవుడి విగ్రహం దగ్గరికి తీసుకెళ్ళాడు. ఛైర్మన్ పది రూపాయల నోటు తీసి హుండీలో వేశాడు. పూజారి కన్నులు మెరిశాయి. హారతి వెలిగించి, పూజచేసి ప్రసాదంపెట్టి వారిని బయటివరకు సాగనంపి వీడ్కోలిచ్చి వెనుదిరిగాడు గుడిలోకి పూజారి.

ఈ తతంగమంతా చూస్తూ నిలుచున్న రంగికి ఏమీ అర్థం కాలేదు తండ్రినడిగింది.

"ఎందుకు నాయన మనకు ప్రసాదం పెట్టలేదు, దేవుడిని ముట్టుకోనివ్వలేదు."

"మనము బీదవాళ్ళమమ్మా. బీదవాళ్ళకు దేవుడి పాదాలను దేవుడి ప్రసాదాన్ని ముట్టే అర్హత లేదమ్మా" రంగిని సముదాయించాడు బరువెక్కిన హృదయంతో తన గుడిసెకు దారితీస్తూ.


"ఈ దేవుడు ధనవంతుల దేవుడన్న మాట. అయితే మన దేవుడు ఎక్కడున్నాడు." అమాయకంగా అడిగిన రంగికి ఏమి సమాధానం చెప్పాలో తెలియక వడి వడిగా గుడివైపు సాగిపోయాడు. బరువుగా మల్లన్న.

★

# ఆసక్తిగొలిపే అద్భుతాలు

## చేపల్లో 'చాటర్ బాక్స్‌లు'

జీవశాస్త్రవేత్తలు యిటీవల చేపలకు సంబంధించిన ఒక విద్దూరాన్ని కనిపెట్టారు. చేపల్లో వదర్బోతులుంటాయనీ, అవి యీలలు వేస్తాయి, గర్రుమంటాయి, గుర్రుమంటాయి, బుస్సుమంటాయనీ వాళ్ళు చెప్తున్నారు. సాగర గర్భంలో సాగే యీగొడవ పెద్ద 'న్యూసెన్సు' అయిపోయిందని వారు భావిస్తున్నారు. సము



ద్రపు దొంగలను అంచనా వెయ్యటంలో శాస్త్రవేత్తలకు యీ కోలాహలం అడ్డు వస్తుందని కూడా శాస్త్రజ్ఞులు విసుక్కుంటున్నారు.

అయితే, తమ యీ వాగుడుకు కొంత ప్రయోజనముందనీ, తమ వేట కార్యక్రమంలోనూ, శత్రువు ప్రమాదాన్నుండి తప్పించుకోటంలోనూ, నూతన మిత్ర సందర్శనంలోనూ తమకీ 'లొడ లొడ' తోడ్పడుతున్నాయని చేపలు విశ్వసిస్తున్నట్టున్నాయి!

## అంతర్వాహినులు


ప్రపంచంలోని మిక్కిలి పెద్దవైన వోల్గా, గంగ, మిసిసిపి, సీన్, రైన్ మొదలైన నదులన్నింటి క్రిందా అంతర్వాహినులున్నాయని భూగర్భ శాస్త్రజ్ఞులు యిటీవల కనుగొన్నారు. అవి సరిగా భూమిపైగల యీ మహానదుల క్రిందనే, అనేక వందల మీటర్ల లోతున ప్రవహిస్తున్నాయి. "నదీనాం సాగరో గతిః" అన్నది భూమిపైగల నదులకే వర్తిస్తుంది. గాని, ఈ అంతర్వాహినులకు వర్తించదు. పైగా వీటి విషయంలో "అంతర్వాహినం సాగరో తిరోగతిః" అనాలేమోకూడా. అవి సముద్రం నుండి బయల్దేరి, పైనున్న నదులకు ఎదురుబదురుగా భూగర్భంలో ప్రవహించి, తిన్నగా భూమిపైగల నదీముఖాన్ని చేరుకుంటాయని శాస్త్రజ్ఞులంటున్నారు.

భూమిపై గల నదుల ఆటుపోట్లకూ, యీ అంతర్వాహినులకూ సంబంధం వుందా? ఉండవచ్చుననే తోస్తున్నది. అయితే, యీ విషయమింకా రుజువు కాలేదు.

త్రివేణీ సంగమంలోని మన సరస్వతీనది యిటువంటి అంతర్వాహినేనేమో!

## 4½ వేల ఏళ్ళనాటి నోటుబుక్కు

'నోట్ బుక్కు' లో మిక్కిలి పురాతనమైనవాటికి ఎంత వయస్సుందో మీకు తెలుసా? 4,500 సంవత్సరాల వయస్సుంది! ఇటీవలనే అవి ఇరాన్ దక్షిణ భాగంలో బయట పడ్డాయి.



కాల్చిన మట్టి పలకలపై ముక్కోణాకారమైన లిపితో వున్నాయవి.

ఆ పలకలు అస్సీరియన్ బాలబాలికలు దస్తూరి బాగా కుదిరేందుకుగాను దిద్దిన కాపీలని పురావస్తు శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

## అపురూపమైన తెల్ల రైండీర్లు!

తెల్ల రైండీర్లు చాలా అపురూపమైన జంతువులు. ప్రపంచం మొత్తంమీద అవి యీనాడు జెకోస్లోవేకియాలోని కేస్లావ్ సమీపంలోమాత్రమే కనిపిస్తున్నాయి. అవి అక్కడికెలా వచ్చాయి? డానుదేశం నుండి ఒక వంద సంవత్సరాల క్రింద దిగుమతి చేసుకోబడ్డాయి. భారతదేశంలో ఆ జాతి జంతువులు గత శతాబ్దాంతం నాటికి రూపుమాసిపోయాయి. కాగా, ప్రపంచం మొత్తంమీద తెల్ల రైండీర్లు ఒక్క కేస్లావ్‌లో మాత్రమే కనిపిస్తాయన్న మాట!

సమర్పణ : "రాజేష్"